# శిలలో సెలయేరు

కుంపట్లో బొగ్గులు నుసి అయ్యాయి.

రాఘవులు బ్రతుకులాగే అవి వెలుగారిపోతున్నై. ఉండుండి వోసారి ఆశల ఊపిరి వూది, నిప్పురవ్వల్ని ఎగద్రోయాల్సి వస్తోంది.

కుంపట్లో బొగ్గుల్ని కుళ్ళగించి, పట్కారుతో రెండు క్రొత్త బొగ్గుల్ని తీసి కుంపట్లో వేశాడు రాఘవులు. బల్లపై పెట్టిన పాల గిన్నెను తిరిగి కుంపటిపైకి ఎక్కించాడు. ప్రక్కనున్న పాతగుడ్డతో చేతులు తుడుచుకుని రోడ్డుమీదకొచ్చి ఆకాశంలోకి చూశాడు.

రాఘవులు మనసులాగే వుంది వాతావరణంవూను :

ఆకాశమంతా నల్లగా మబ్బుపట్టి వుంది.

ఉండుండి ఒక చల్లని గాలి తెమ్మెర అతని టీ దుకాణం మీదుగా వీరమ్మ దుకాణం వైపు వెళుతోంది.

వీరమ్మ తలపుకొస్తే చాలు - రాఘవులికి కడుపు రగిలిపోతుంది. పగ సెగగా భగ్గుమంటుంది. మనసు మనసులో లేకుండా పోతుంది.

రాఘవులు వీరమ్మ దుకాణంవేపు చూడకూడ దనుకుంటూనే చూశాడు. వీరమ్మది కూడా టీ దుకాణమే. అయితే వీరమ్మ అతనిలా ఖాళీగా లేదిప్పుడు. నిట్టాడి పాకలో అటూ, ఇటూ వేసిన కొయ్య

బెంచీలపై కూర్చున్న 'కష్టమర్ల'కి టీ కలిపివ్వడంలోనో, వాళ్ళ దగ్గర్నుంచీ డబ్బులు తీసుకోడంలోనో, పెద్ద డబ్బాలోని పంచదారను బల్లపై వుండే చిన్న గిన్నెలోకి మార్చుకోవడంలోనో, 'బిజీ'గా వున్నట్లు కనిపిస్తోంది.

'కన్పించడమేమిటి, బిజీగానే వుంది' అనుకున్నాడు రాఘవులు.

అతను నొసలు చిట్లించుకున్నాడు. 'అవును.... ఆ మడిసి ఎప్పుడూ బిజీగానే వుంటుంది. పక్కనోడి నోట్లో దుమ్ముకొట్టే వాళ్ళెప్పుడూ బిజీగానే వుంటారు.' కసి ఉడికిపోతోంది!

తను ఆమె దుకాణంవైపు చూస్తున్నట్టు - వీరమ్మ పసిగట్టిందనే విషయం గమనించాడు రాఘవులు.

ఠక్కున చూపులు మరల్చుకున్నాడు. నింగి చూపులు చూస్తూ 'వర్షమొచ్చేట్టుందే' అనుకుంటున్నట్లు, పెద్దగానే అనేసి లోపలి కొచ్చాడు.

లోపలి కొచ్చాడనేగాని ఏం చేయడానికీ తోచలేదతనికి.

ఆలోచన మనసుని రగిలిస్తోంది. వీరమ్మ కొట్టు తన కొట్టు పక్కగా వున్నంత కాలం- తను బాగుపడడు. అవును - ఆమె తనని బాగుపడనీదు. 'ఎవరి వ్యాపారం వాళ్ళదిలే — ఎందుకొచ్చిన యవ్వారం' అనిపించి, ఎప్పటికప్పుడు తను వెనకడుగేస్తున్నాడు. 'లేకపోతే ఈపాటికి టొపేరం లేచిపోయుండేది.'

ఇంతలో రంగడక్కడికొచ్చాడు. చింపిరి తల, జారిపోతున్న నిక్కరు, నల్లగా నిగనిగలాడే చొక్కా లేని శరీరం - ఇదీ వాడి రూపం. టీ గ్లాసుల్ని కడగడం, మైదా రొట్టెలు తిన్న ఆకుల్ని చెత్త కుప్ప పైకి చేరవేయడం - ఇదీ రంగడి పని. ఆ టీ

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc No 1134
Date
CUDDAPAH.

దుకాణంలో.

‘నాకో పావలా గావాలి’ – తల గోక్కుంటూ అడిగాడు వాడు.

రాఘవులు గతుక్కుమన్నాడు.

రంగడి వైపు అదోలా చూసేడు. వాడు నేల చూపులు చూస్తూ, కుడికాలి బొటన వేలితో మట్టిని కుళ్లగిస్తున్నాడు.

రంగడు తన కివ్వవలసిన పావలానే అడిగినా రాఘవులికి మాత్రం చిరాకు ముంచుకొచ్చింది.

‘పావలాలు ఎక్కడ్నుంచి తెమ్మంటావురా? పొద్దుట్నించీ ఎన్ని వందల యాపారం సేశాననుకుంటున్నావేం? సరుకంతా పూరికే పోతోందే అని నేన్జస్తుంటే.... పావలా గావాలంట, పావలా....’

రాఘవులు మాట్లాడటం ఆపి చూసేసరికి రంగ డక్కడ లేడు. దొడ్డివైపు గుండా కాలువకి వెళ్లి చేపల కోసం గాలం విసురుతున్నాడు వొడ్డుమీదుండి. దుకాణంలో కష్టమర్లు లేనప్పుడు రంగడి హాబీ అది.

రాఘవులు నిట్టూరుస్తూ సొరుగులాగి ‘గల్లాపెట్టి’లా ఉపయోగపడుతున్న గ్లాసులోకి చూశాడు. అర్ధరూపాయ చిల్లర కంటే వుండదందులో. నిరాశతో గ్లాసుని మళ్లా లోపలపెట్టేడు.

‘ఇంత మందకొడిగా తయారైందేంటి యాపారం? ఇట్టాగైతే రోజు గడిచేదెట్టా? నెల దిరిగేసరికి నిట్టాడికి అద్దెగట్టేదెట్లా? ఇవాళన్నా నాలుగు డబ్బులొస్తే ఇంటిదానికి సూదిమందు వేయిద్దామనుకొంటిని. వారం రోజుల్నించీ కడుపునొప్పితో తన్నుకులాడుతోంది, పాపం. ఎన్నిమందులు వాడినా గుణం కనపట్టం లేదు. పోయిన్నెల్లో పంచాయితీ గుమాస్తా నరహరి భార్య కూడా ఇట్లాగే కడుపులో నొప్పి, నొప్పి అంటూనే కడతేరిపోయిందిట! మాయదారి రోగం. అదొచ్చిన ఇరవైనాలుగ్గంటల్లో ఆపరేసను సేయిస్తే సేయించినట్టు, లేకపోతే

ఖాళీ అంట. కొంపదీసి తన రత్తాలు గూడా.... '

ఈ ఆలోచనతో రాఘవులికి భయం ముంచుకొచ్చింది - వొళ్లంతా చెమట పట్టింది. కళవళపడిపోయి, అంతలోనే నిబ్బరాన్ని పుంజుకున్నాడు.

' ఛీ....ఛీ.... యదవాలోచన్లు. మనిషి చేతినిండా పనిలేకపోతే ఇంతే. పురుగు తొల్చినట్టు మనసును తొలుస్తాయి.'

పైపై కండువాతో మొహం తుడుచుకున్నాడు. చూపులు మరల్చుకుంటూ, వేళ్ళతో జుట్టు పీక్కున్నాడు. ఆ వెంటనే మీసం దువ్వుకున్నాడు. రెండు మూడు సార్లు గుటకలు మ్రింగేడు. కుంపటిదాకా వచ్చి, పాలమీది మీగడ తరకల్ని సత్తుగరిటతో వో పక్కకి తోసేడు. సొరుగులాగి మళ్ళీ వోసారి ' గల్లా ' గ్లాసు చూసుకున్నాడు. గుండెల్లో గుబులు సాగింది.

' ఒక్కడైనా యిటొస్తాడేమో సూడు. కాలవమీది కళాసులొచ్చినా ఈరమ్మ దుకాణంలోకే ఎగబడ్తున్నారు. బియ్యంమిల్లు పనోళ్ళూ టీనీళ్ళకి అక్కడకే ఎల్తున్నారు. ఆఖరుకు యిటునుంచి వచ్చే డే డ్యూటీ కానిస్టేబులు కూడా తన కొట్టువేపు కన్నెత్తి కూడా సూడకుండా ఈరమ్మ పాకలోకే ఎల్తాడు.... '

రాఘవులి ఆలోచన్లను చెదరగొట్టూ, అతని టీ దుకాణాని కెదురుగా— రోడ్డుకి అవలివైపున లారీ ఒకటి ఆగింది. యిటువైపు డోరు తెరుచుకుని డ్రైవరు, అటువైపు డోరు తెరుచుకుని కేబిన్‌లోని మరో యిద్దరు వ్యక్తులు దిగారు. వాళ్లు ముగ్గురూ ఇటువేపే నడుస్తున్నట్లు తోచింది రాఘవులికి.

'ఫరవాలేదు. మూడు టీల బేరం తగిలింది. వాళ్లొచ్చేసరికి రెడీ చేసి పెడ్తే ఆలస్యం లేకుండా యిచ్చేయొచ్చు. ఆలస్యం చేస్తే

కష్టమర్లు రారు' అనుకుని టీ కలిపే ప్రయత్నంలో నిమగ్నమవబోయిన రాఘవులు ఒక క్షణం ఆగిపోయాడు.

వాళ్లు ముగ్గురూ ఏదో మాట్లాడుకుంటూ లారీ వెనక టైర్లలో గాలి వుందో, లేదో చూసుకుని యిటు నడిచినట్టే నడిచి, చివరికి వీరమ్మ దుకాణంలోకే వెళ్లారు.

తప్పనిసరిగా ఊపిరి పీల్చినట్లు నిరాశను దిగమ్రింగేడు రాఘవులు. కాని, ఆ నిరాశ బాధని కల్పించింది. బాధ కసిని వుసి గొల్పింది.

రాఘవులికి పిచ్చెత్తినట్లైంది- ఎట్టా ఈ పీడ విరగడై పోతుందా ? అనిపించింది.

రాఘవులి తలలో నటేశం మెదిలాడు.

నటేశం కూడా లారీ డ్రైవరే. అతను రాఘవులి కష్టమరు. ఎన్నో సంవత్సరాలుగా అవసరమున్నా లేకపోయినా ఆ రోడ్డు వెంట వెళ్తున్నప్పుడు ఆ సెంటర్లో ఆగి రాఘవులిచేతి స్పెషల్ టీతాక్కుండా వెళ్లడతను.

వీరమ్మ ఈ వూరు రాకముందు ఎక్కడుండేదో, ఏం చేసేదో - రాఘవులికి తెలీదు. తెలుసుకోవాలన్న ఉత్సుకతకూడా వుండేది కాదతనిలో. కాని, నటేశం చెప్పాడు - వీరమ్మ సంగతి. ఆవిడది అనంతపురం దగ్గర ఏదో వూరుట. పెళ్ళయి కాపురం చేసుకునే వీరమ్మ మనసులో పురుగు ప్రవేశించింది.. పూల మొక్కలమ్ముకునే ఒక వ్యాపారితో అక్రమ సంబంధం పెట్టుకుని విజయవాడ లేచివచ్చింది. ఆవిడ ముగ్గురు బిడ్డల తల్లి కావడానికి కారణమైన ఆ వ్యాపారి హఠాత్తుగా అంతర్ధానమైనాడు. అతన్ని వెతుక్కుంటూ ఊరూరా తిరిగిన వీరమ్మ అలసిపోయి ఇక్కడ టీ దుకాణం పెట్టి విశ్రాంతి

తీసుకుంటోందిట.

'ఇశాంతి కాదు నరేశం, నా ఉసురు పోసుకుంటోంది. లేకపోతే ఏమిటి చెప్పు. అదక్కడ పొయ్యెలిగించింది. నాకు రాబడి తగ్గిపోయింది. పిల్లలు గలది, ఆడకూతురు అని పత్తా యిస్తున్నాను గాని....' రాఘవులు ఆపైన మాట్లాడలేదు.

నరేశం నవ్వి.... "ఏం జేస్తావేంటి?" అన్నాడు.

రాఘవులు నరేశం మాటల్ని వినవస్తే కూర్చున్నాడు.

"నీకేమైనా ఆలోచనుంటే చెప్పు. నే సాయపడ్తాగా" అంటూ వెళ్ళిపోయాడు నరేశం.

రాఘవులి గుండె జల్లుమంది. వ్యాపారం పడిపోతున్న దన్న కసికొద్దీ అలా అన్నాడే గానీ, తనకు వీరమ్మ నేదోచేయాలనే తలంపే లేదు. అసలు ఈ నరేశం ఇట్లా మాట్లాడిందెందుకో! అతనికి వీరమ్మమీద కోపమెందుకో!' అని ఆలోచించాడు, చాలా రోజులు రాఘవులు. 'ఒకేళ నరేశం ఇసిరిన గాలానికి ఈరమ్మ సిక్కుకో లేదో మో.' తను అలా అనుకోడం సబబుగా తోచలేదు రాఘవులికి. అసలు సంగతేమిటో నరేశాన్నే అడుగుదామనుకున్నాడు గాని, 'ఛ మనకెందుకులే' అని వూరుకున్నాడు.

"వీరమ్మ టీ అంటే ఎట్టాగైనా మజానేరా!"

"వీరమ్మ టీ ఏంటి - వీరమ్మే మజా అసలు"

"హ....హ....హ్హా...."

రాఘవులి కళ్ళ ముందు గతం తెర తొలగింది. లారీలోంచీ దిగిన ముగ్గురూ టీ తాగి వెళ్ళిపోతున్నారు.

"అవును ఈరమ్మే మజా అసలు! వగలుపోతూ టీ గ్లాసందిచ్చే సరికి ఈ ఎదవలు అయిపోతారు. ఈళ్ళనసుకునేం లాబం!

ఇదంతా ఈరమ్మ తెంపరితనం, మహాచ్ఛం' అనిపించింది రాఘవులికి.

'....ఈరమ్మ పక్కన యాపారం చెట్టుకింద మొక్క యవారంలా వుంది'....'నశేశం అన్నట్టుగా వీరమ్మను దారికడ్డం తీసేస్తే....?'

ఉరుము వురిమింది. ఉలిక్కి పడ్డాడు - రాఘవులు.

'ఇరవై పైసలన్నా యియ్యండి' బ్రతిమిలాడుతున్నట్టుగా అన్నాడు రంగడు.

రాఘవులు వాడివేపు చూశాడు.

వాడెటో చూస్తున్నాడు, రాఘవులి మొహంలో చూసే ధైర్యం లేనట్టుగా. పావలానుంచి యిరవైపైసలకి దిగాడంటే, ఈ లోపల ఐదు పైసల చేపల్ని పట్టేడనే సంగతి రాఘవులికి తెలియందికాదు.

'నువ్వే నయంరా కాస్తో కూస్తో సంపాదించావ్. ఈ పూట నాకామాత్రిం బోణీ కూడా కాలేదు' అనుకున్న రాఘవులు పైకి మాత్రిం 'ఛ....పా....యదవ....' అని కసురుకున్నాడు.

గొణుక్కుంటూ వెళ్లిపోయాడు రంగడు.

పెళ్లున ఉరిమింది. వీరమ్మ దుకాణంలో కస్టమర్లు ఎవరో పెద్దగా నవ్వేరు. ఉండుండి వీరమ్మ కంచు కంఠంకూడా ఆ నవ్వులతో శృతి కలుపుతోంది.

యింటిదగ్గర రత్తాలు గుర్తొచ్చింది రాఘవులికి. 'ఉరుములంటే బయం దానికి. పైగా యిప్పుడు సుస్తీగా కూడా వుంది. సూదిమందుకి సరిపడే డబ్బులు ఎలాగూ వచ్చేలా లేదీపూట. కనీసం అరకూ, బిళ్లలూ కొంటాన్నికైనా వస్తయ్యో, రావో అనుకుంటూ నాలుగువేపులా రోడ్లనీ్ని గాలిస్తున్నాడు, చూపుల్తోనే - ఒక్క బేరమైనా తగలకపోతుందా అని?

రాఘవులి పర్‌యత్నం వృధాపోలేదు. పడమటి నుంచి వచ్చే

రోడ్డుపైన ఓ యిరవైయేళ్ల కుర్రాడు నడిచొస్తున్నాడు. క్రిమేపి ఆ వ్యక్తి తన దుకాణంవేపే వస్తున్నట్లు నమ్మకం కలిగింది రాఘవులికి. అతనిలో అణగారుతున్న ఆశను పొగ వూదే గొట్టంతో ఎవరో రగుల్కొలిపినట్లయింది. కూర్చున్న వాడల్లా లేచినుంచుని ఆప్యాయత తొణికిసలాడే చూపుల్తో అతనికి స్వాగతం పలికేడు.

ఆ వ్యక్తి, దగ్గరకొస్తున్నాడు : వీరమ్మ దుకాణం వరకూ వచ్చాడు. వీరమ్మ దుకాణం దాటేడు. తన దుకాణంవేపే నడుస్తున్నాడు.

ఇంతలో వీరమ్మ కంఠం ఖంగున వినిపించింది.

'రా బాబూ, రా - యిటారి. ఏడేడి పరోటాలున్నై. కర కరలాడే పకోడీలున్నై. నిషా పుట్టించే గరమ్ 'చా' వుంది. రా....రా....'

ఆ వ్యక్తి ఆగిపోయాడు. తన ఎడమ భుజం మీదుగా తల తిప్పి వీరమ్మ దుకాణంవేపు చూశాడు. క్షణం తటపటాయించి, నాలుగడుగులు వెనక్కువేసి వీరమ్మ దుకాణంలోకి జొరబడ్డాడు.

రాఘవులు నిర్ఘాంతపోయాడు. వీరమ్మ గడసరితనం అతనికి మహాపరాధంలా తోచింది. టీ కలిపేముందు తెర్లే నీళ్లలా అతనిలోని 'రగతం' కుతకుతలాడింది. పళ్ళు పటపట లాడాయి. దూరానెక్కడో పిడుగు పడ్డ శబ్దమైంది.

అదే సమయంలో రంగడు మళ్ళీ వచ్చాడక్కడికి, కొంత ఏడుపు, కొంత భయం, కొంత ఉక్రోషం కలిసిన గొంతుతో అన్నాడు : 'నిన్న కూడా ఏమీ యియ్యలేదు. యివాళ పదిహేను పైసలన్నా యివ్వాలి. 'దెబ్బకు తా' ఆఖరు రోజియ్యాల.'

రాఘవులు జెయ్యమని లేచాడు. 'గాడిద కొడకా' నీకు డబ్బులు కావాలంటారి' అంటూ వాణ్ణి కొట్టబోతే, వాడు పరుగెత్తుకుంటూ

పారిపోయాడు.

రాఘవులికి దెయ్యం పూనినట్లయింది. ఆవేశంతో ఊగిపోతున్నాడు. ఒక్కచోటా కాలు నిలవడంలేదు. కసి చిందులు తొక్కిస్తోంది. అతని ముఖం కూడా ఆకాశంలోని మేఘాల్లా నల్లబడింది. ఏ క్షణంలోనైనా వర్షం పడేటట్లుగా వుంది.

వీరమ్మ దుకాణంలోంచి పెద్దగా కేరింతలు, నవ్వులు. రాఘవులిక తమాయించుకోలేక పోయాడు. వీరమ్మ దుకాణంకేసి దూసుకుపోయాడు.

[ ఈరమ్మా - నీకిదేం పొయ్యేకాలం ? ]

'ఈరమ్మా, ఈరమ్మా .... నీకిదేం బాగాలేదు.'

'ఏంది బుల్లోడా ?' వీరమ్మ రాఘవు లెప్పుడూ అలాగే పిలుస్తుంది. వీరమ్మ ముందు రాఘవులు బుల్లోడులాగానే వుంటాడు.

[ నంగనాచిలా అడక్కు. ]

'నా దుకాణంలోకొచ్చే కష్టమర్ని పనిగట్టుకుని పిలవడం న్యాయమేనా ?'

'నాయమేంటి బుల్లోడా, యిది యాపారం. నీకు తెల్దేంటి ? గాలమేయకుండా శాపొచ్చి నీ వొళ్లో పడుద్దా. యిదీ అంతే.'

[ అందేంగాదు - నీ మాయ రోగం ఇది ! ]

"నా దుకాణంలో కొచ్చేవాళ్ళని పిలపడానికి నీ కక్కులేదు. నీ దగ్గరికి వాడిగ్గా వొచ్చేవోళ్ళని పిల్చుకో. అంతే గానీ...."

వీరమ్మ ఫక్కున నవ్వింది. వీరమ్మ విరగబడి నవ్వింది. కొయ్య బెంచీలపైకూర్చున్న కష్టమర్లు కూడా నవ్వేరు. టీ తాగుతూ నవ్వడంచేత వాళ్ళకు పొలమారి, వాళ్ళ నవ్వు దగ్గుగా మారింది.

"పిచ్చోళ్ళా వున్నావే. నా దగ్గరికొచ్చే వోళ్లని నే నేం పిలవక్కర్లా. రానివాళ్ళనే పిలవాలి" - అని మళ్ళీ నవ్వసాగింది వీరమ్మ.

రాఘవులికి ఒళ్ళంతా జెర్రిలు పాకినై. తన చేతగానితనం, రత్తాలు మూలుగు, 'నేను సాయపడ్తాగా' అన్న నరేశం మాటలు, రంగడు డబ్బు లడగడం, వీరమ్మ నవ్వు — యివన్నీ అతని బుర్ర చుట్టూ గిరికీలు కొడుతున్నాయి.

"అంతా నవ్వవా వీరమ్మా, కాస్తుంచుకో. ముందు శానా బతుకుంది. పూలమొక్క లోళ్లీ పూలు బూయిస్తారు మళ్లీ. అప్పుడు నవ్వుదుగాని."

"ఏఁవిటార్రి, ఏం కూశావ్? మళ్లీ కుయ్!" అంటూ బయటి కొచ్చింది వీరమ్మ.

"ఏం, కొడ్తావా? ఉన్నమాటంటానికి నాకేం బయవంట." బింకంగా అన్నాడు.

"కొడ్తానా, కొట్టి చూపిస్తానా" అంటూ చేతిలోవున్న జర్మన్ సిల్వర్ గరిటతో రాఘవుల్ని ఎడాపెడా కొట్టేసింది, వీరమ్మ.

వాళ్లిద్దరి చుట్టూ జనం గుమిగూడారు. వాళ్లకది గొప్ప సీన్. ఒక ఆడది వో మొగాణ్ణి నడిబజారుమీద నిలేసి కొట్టడమనేది సాధారణంగా అందరికీ అన్నివేళలా కనపడే దృశ్యంకాదు మరి!

వీరమ్మ పౌరుషాన్నీ, తన అపౌరుషాన్నీ తిట్టుకుంటూ, వీరమ్మ చేతిలోని గరిటెను లాగేసుకోవాలని, విఫలప్రయత్నం చేశాడు రాఘవులు.

ఈ గందరగోళానికి ఎక్కణ్ణుంచో వచ్చిన రంగడు, వెనకాల నుంచి వచ్చి వీరమ్మ చేతిలోంచీ గరిటెను లాక్కుని వీరమ్మపై కలియబడ్డాడు. వీరమ్మ వాడి దెబ్బల్ని లెక్కచేయకుండానే రాఘవులి పైకి ఉరుకుతోంది.

యింతలో అక్కడ చేరినవాళ్లలో కొందరు వీరమ్మని, కొందరు

రాఘవుల్ని వారి వారి దుకాణాలవేపు లాక్కుపోయారు.

ఇక ఆగలేనన్నట్లు వర్షం కుండపోతలా కురవసాగింది.

– రాఘవులికి ఉద్రేకం తగ్గేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది. తన చేతగానితనానికి అతనికి కసిదీరా ఏడవాలనిపించింది. ఒక ఆడదాని పక్కన వ్యాపారాన్ని ఎటూ సాగించుకోలేకుండా వున్నాడు. ఇవ్వాళ, చివరికి వీరమ్మ తనని నిలువునా బజారుపాల్జేసింది. పరువు తీసేసింది.

రత్తాలు పక్కగా పడుకుని నిట్టాడివాసాలకేసి చూస్తున్నాడు రాఘవులు. అతని ఆలోచన పరిపరివిధాల పోయింది.

నరేశం గుర్తుకొచ్చాడు. వీరమ్మ గురించి మాట్లాడుతూ అదోలా నవ్వే అతని నవ్వు గుర్తుకొచ్చింది; చివరికి అతని మాటలూ గుర్తుకొచ్చినై.

— "నీకేమైనా ఆ ఆలోచనుంటే చెప్పు. నేను సాయపడ్తాగా"......... మళ్లీ ఉరుము ఉరిమింది.

రత్తాలు "అబ్బా" అంటూ మూలిగి, ఈవైపు తిరిగి రాఘవులి గుండెలమీదికి తల ఆనించి పడుకుంది. ఆమె చేతిని తనచేతిలోకి తీసుకొని లాలనగా నొక్కాడు రాఘవులు.

* * *

నెల రోజులు దాటింది.

కాలంవేసిన మలుపులమడతల్లో రాఘవులి జీవితం మారింది.

రత్తాలు కడుపులో నెప్పి చివరికి వాము, వేడీన్నళ్లతో తగ్గిపోయింది. ఇప్పుడు రంగడు అడక్కుండానే రాఘవులు వాడికి ప్రతి సాయంత్రం పావలా ఇస్తున్నాడు.

రాఘవులికిప్పుడు చేతినిండా పని. క్షణం తీరికలేదు.

అయినా అతని మనసుని ఆలోచనలు విడిచిపెట్టలేదు. 'కడుపులో నొప్పితో సస్తుందనుకున్న రత్తాలు బతకడమేమిటో, తక్కున కలరా వచ్చి పెద్ద పెద్ద డాక్టర్లచేత ఎన్నో సూదిమందు లేయించినా, నయంగాక ఈరమ్మ కన్ను మూయడమేమిటో !! ఎక్కడో ఎవరికో పుట్టిన ఈరమ్మ ముగ్గురి బిడ్డలకీ తనే తల్లీ, తండ్రి అయి నిలవడమేమిటో !!! ఇదంతా ఎవరి లీల ?'

'వోయ్ రాగవులూ ! ఓ లిప్టన్ టీ కలుపు'..... — నటేశం ! తలకు చుట్టుకున్న కండువా తీసి విదిలించుకుని, భుజాన్న వేసుకుంటూ వచ్చాడు. 'ఒకటికి ఒకటి కలిపితే ఏదో అయిందట ఎవరికో. రెండు దుకాణాల్ని ఒకటి చేశావ్ బాగానే వుంది. కానీ, ఆ బుడ్డోళ్లని తగిలించుకున్నా వెందుకంట. తన్ని తగిలెయ్యక ?'

'అట్టాగనకు నటేశం ! యాపారంలో అనేక తగాదా లొస్తా వుంటయ్. నాయానికి ఈరమ్మని అడ్డుతొలగించు కోవాలనీ ఆలోచించాను.

కాని, తల్లిసచ్చిన బిడ్డల్ని సూట్టాని కెళ్ళినాన్నడు నన్ను కావిలించుకుని బావురుమన్నారీ కూనలు." రాఘవులి కళ్లు చెమర్చినై. గుటకలు మింగుతూ అన్నాడు. "నాకు వాళ్ళేమీ కాకపోవచ్చు. కానీ, వాళ్లకిప్పుడు నేనే ఆధరువు. ఏనాటికైనా వాళ్లని పెద్దజేసి వాళ్లమ్మ దుకాణాన్ని వాళ్లకప్పగించాలి. అది నా డ్యూటీ. ఏఁవంటావ్ ?"

'టీ దీస్కో .... నీకోసం.... స్పెషల్ ....' నటేశం టీ గ్లాసు అందుకున్నాడు. రాఘవులి కళ్లలోకి చూసేడు.

రాఘవులు కళ్లు తృప్తితో మెరిసిపోతున్నై. ❊ ❊ ❊